మినీకథ

# వడ్రంగిపిట్ట



-ఆర్.ఎస్.కె.మూర్తి

**అప్పటికి అయిదారు గంటలుగా అతలాకుతలం అయిపోతూనే వున్నాడు ఆనందం మేస్టారు.**

**పాడు పదమూడు రూపాయిలకు ప్రలోభపడ్డాడు కదా, తన మాడు పగులుతుందని ఆయన కకావికలు అయిపోతూనే వున్నాడు – అప్పటికో అయిదారు గంటలుగా.**

స్కూలుకి వెళ్ళిందే తడవుగా వచ్చాడు సుబ్బారావు బ్లాక్ వారెంటు లాంటి వార్తతో. "గురూగారు, మరో మూడొందలిచ్చుకోవాలి మీరు".

మా మేస్టార్లందరిలోకీ పిన్నవాడు సుబ్బారావు. మార్చి నెల వచ్చిందంటే, మా ఎయిడెడు మేస్టర్లకు విద్యాశాఖవారితో బోలెడన్ని బేరసారాలు అవసరమవుతుంటై. అవన్నీ సుబ్బారావే చూస్తుంటాడు మా స్కూల్లో.

ప్రభుత్వంవారు సంవత్సరం పొడుగునా, డి.ఎ. శ్లాబ్‌లు పెంచుకుంటూ పోతుంటారు గదా – ధరల అదుపునకు, ద్రవ్యోల్బణం తగ్గింపునకు. మిగతా అందరు ఉద్యోగులూ ఏ నెలలో పెరిగిన డి.ఎ. ఆ నెలలోనే పుచ్చేసుకుంటుంటారు. మా ఎయిడెడు మేస్టర్లది – మాదో ప్రత్యేక హోదా. అన్నీ కలిపి బకాయిల పేరుతో మేము మార్చి 31న పుచ్చుకుంటూవుంటాం. ఆనాటికేదన్నా ఫ్రీజ్ వస్తే, మరునటి సంవత్సరం మార్చి 31న అందుకుంటూ వుంటాం. పెరిగిన డి.ఎ. ఏ రెండు శాతమోనే అయినా, ఇట్లా బకాయిలుగా పుచ్చుకునేసరికి అది ఏ రెండుమూడు వేలో అవుతుంది – ఒక్కో మేస్టరికి. అంత డబ్బూ అయ్యవార్లకి ఉత్తపుణ్యానికి ఇవ్వడం బాధాకరమవుతోంది జిల్లా విద్యాశాఖవారికి. కని పెంచిన కూతుర్ని కోతికిస్తా (అల్లుడు)గాడికి అప్పజెప్పవలసివచ్చినట్టు వారు బాధపడిపోతారు పాపం! అంచేత వారా బకాయిల్లో బోనస్‌లు పుచ్చేసుకుంటారు. అట్లా వారు ఏడో, పదో లక్షలు ఏడాదికి కతికేస్తుంటారు.

మొన్న హైద్రాబాదు వెళ్ళేముందే చెప్పాడు సుబ్బారావు. "గురూగారూ, ఓ రెండొందలు ఇచ్చివెళ్ళండి. ఎందుకైనా మంచిది". ఇచ్చాడు, ఆనందం మేస్టారు. హైద్రాబాదు నుంచి వచ్చాడో లేదో అదనపు కేటాయింపులు. విద్యాశాఖవారు రేట్లు పెంచేశారుట. ఒక్కో ఎస్.ఆర్. (సర్వీస్ రిజిస్టర్)కి నాల్గు వందలు ఫ్లాట్ రేట్ పెట్టేశారుట. ఎల్.ఎఫ్. ఆడిట్‌వారికి తలకో వంద వెరసి ఐదు వందలు. ఇచ్చింది రెండు వందలు పోను కరబాకీ మూడొందలు. లెక్కలు చెప్పాడు సుబ్బారావు.

తప్పుతుందా మరి!

తప్పించుకునే మార్గం మా రాఘవయ్య మేస్టారికి తెలును. లంచాలివ్వడం తప్పనాయనా అని ఆయన నీతులు బోధిస్తాడు. నలుగురితోపాటు తనకెట్లాగూ బకాయిలు వస్తయిగదా! ఆయన వాటా కూడా మిగతావారే వేసుకుంటారు – ఏడు తరాలవారికి ఆశీస్సులతో.

* * *

అదనపు డిమాండుతో అటూయిటూ అయిపోయిన ఆనందం మేస్టారుని ఆ తర్వాత కాసేపటికి ఆలోచనల తేనెటీగలు కుట్టసాగినై.

అవును మరి, ముష్టి పదమూడు రూపాయిలకు కక్కుర్తిపడితే ఏమవుతుంది మరి! దేవుడు లేడూ, ధర్మం జయించదూ – కన్నాంబగారి డైలాగు గుర్తుకొచ్చింది ఆనందం మేస్టారికి.

నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో వస్తూ విజయవాడ వరకే బెర్తు తీసుకున్నారాయన. మార్నింగ్ స్కూళ్ళు కదా! సికింద్రాబాద్ నుంచి ఆరుగంటల్లో విజయవాడ వచ్చే ఆ ఎక్స్‌ప్రెస్ అక్కడినుంచి బందరు చేరడానికో ఆరు గంటలు తినేస్తుంది తాపీగా, తీరికగా. అంచేత విజయవాడలో దిగి బస్సుకి వెళ్ళి బడికి అందుకోవాలనే ఆలోచన ఆనందం మేస్టారికి. తీరా మోస్తే తన బెర్తు చుట్టూ అంతా ఒంటరి ఆడవాళ్ళే. తన ముసలితనం తనకో అదనపు సావకాశం ఇచ్చింది ఆడవాళ్ళ మధ్య. ఒక మగవాడన్నవాడు అక్కడున్నాడనే జెరుకే లేకుండా వాళ్ళంతా క్రిందా మీదా పడడం, అవీఇవీ ఏవీ సర్దుకోకుండా విరగబడడం – అదంతా ఆయన ముసలి ప్రాణాలను కూడా జివ్వుమనిపించింది. వాళ్ళంతా పాలకొల్లులో గృహ పరిశ్రమలేవో నిర్వహిస్తారుట. ఢిల్లీలో వ్యాపారాలు చేస్తుంటారు. వాళ్ళ కబుర్లూ– కాకరకాయలూ అవన్నీ ఏవో ఉద్రేకపెట్టినై ఆనందం మేస్టార్ని. అందుకే ఆయన ఆ రైలులోనే బందరెళ్ళిపోవాలనుకున్నాడు – కం వ్వాట్ మే అన్న సాహసంతో. ఎట్లాగూ రిటైరు కాబోతున్నాను గదా హెడ్మాస్టరు గారు ఏమంటారులే అనే దిలాసాతో.

కానైతే అట్లా ఆ పడ(తు)కల బోగీలోనే ప్రయాణం కొనసాగించాలంటే మరో 58 రూపాయిల టిక్కెట్ తీసుకోవాలన్నాడు టి.సి. 80 కిలోమీటర్లకు 58 రూపాయిలా! అమ్మ జాఫర్‌షరీఫ్ అని గొల్లుమన్నది మేస్టారి హృదయం. గంటుపెట్టుకుంది ఆయన ముఖం.

ఆ ముసలి ముఖంమీదేదో జాలి కలిగినట్లున్నది కుర్ర టి.సి.కి. పోనెండి మేస్టారూ, బెర్తు చార్జీ తీసేస్తాను. ఓ 23 రూపాయిల టిక్కెట్ కోస్తానని కన్సెషన్ ఇచ్చాడా కుర్రాయన, భూమి కబ్జాదారులకు దాని ఖరీదులో 25 శాతం కన్సెషన్ ఇచ్చినట్టుగా. రంగు పుంజుకుంటున్నది ముఖం. ఇంతలో పాలకొల్లు జట్టులో అందరికంటే మరీ విశృంఖలంగా తనను రాత్రంతా ఊరించిన ఓ అమ్మడు అందుకొంది. "టిక్కెట్లు రాయటాలు, కోయటాలు ఎందుకు సార్! ఆ టి.సి.గారికో పది రూపాయిలివ్వండి" కట్నం బేరం కుదిరిన పెళ్ళికొడుకులా సిగ్గుపడిపోయాడు కుర్ర టి.సి.

అట్లా ఓ పది అతనికి కొట్టి తానో పదమూడు కొట్టేశాడు ఆనందం మేస్టారు. జాఫర్‌షరీఫ్‌గారి కిట్టీ నుండి! పగలబడి నవ్వుతూ విరగబడి తుళ్ళుతూ మురిపించే అంగనల మధ్య మరో రెండు గంటల మురిపాలకోసం.

* * *

అవునుగాని సుబ్బారావ్, మన డబ్బు మనకివ్వడానికి కూడా ఈ గుమాస్తాలను మేపటమేమిటోయి. ఎప్పటికి పోతుందో ఈ దురన్యాయం? అన్న ఆనందం మేస్టారి ప్రశ్నకాని ప్రశ్నకు సమాధానం సుబ్బారావు చెప్పలేదు.

"మొన్న 13 రూపాయిలకు కక్కుర్తిపడడం మానేసినప్పుడు" టక్కున సమాధానం చెప్పింది వడ్రంగిపిట్ట మనసు! బండబారిపోనటువంటి ధర్మచింతన ముక్కుతో!